నేటి దినపత్రిక
# సూర్య
18వ వసంతంలోకి
శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు
శనివారం | 07 డిసెంబర్ 2024 | పేజీలు 8

## వాహనాలు, గన్ని బ్యాగులు కృష్ణాజిల్లాకు పంపాలి



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** కలెక్టర్ కార్యాలయంలో జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ వారితో కలెక్టర్ ఆనంద్ శుక్రవారం సాయంత్రం సమావేశమయ్యారు. సమావేశంలో పౌర సరఫరాల కమీషనరు, విజయవాడ వారి సూచనలు మేరకు కృష్ణా జిల్లాలో నుండి వరి ధాన్యాన్ని సేకరించి నెల్లూరు జిల్లాకు తరలించాలని కోరడంతో, నెల్లూరు జిల్లాలోని మిల్లర్లందరినీ వారి వారి వాహనాలు, హమాలీలు, వరిని సేకరించడానికి గన్నీ బ్యాగులతో సహా వెంటనే కృష్ణా జిల్లాకు పంపాలని, మిల్లర్ అసోసియేషన్ వారిని కోరారు. కాగా మిల్లర్ అసోసియేషన్ వారు వరి ధాన్యాన్ని సేకరించే విషయంలో వారికి వచ్చిన సందేహాలను నివృత్తి చేసి వెంటనే నెల్లూరు జిల్లా నుండి వరి ధాన్యాన్ని సేకరించుటకు వాహనాలను కృష్ణ జిల్లాకు పంపాలని సూచించారు.

## నేడే బడి పండుగ



- మధుర జ్ఞాపకంగా నిలిపేందుకు కృషి
- తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఉత్సుకత
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు పూర్తి సన్నద్ధం
- కలెక్టర్ ఆనంద్

3లో..

## హెూంగార్డ్ వ్యవస్థకు, పోలీస్ శాఖకు
## మంచి పేరు తీసుకురావాలి

- జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్
- 62వ హెూంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



2లో..



## ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా..
# రెవెన్యూ సదస్సులు

- 6 నుంచి జనవరి 8 వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు
- క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారానికి చర్యలు
- ప్రజలకిచ్చిన మాట ప్రకారం ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం
- ప్రజల ఆస్తులకు రక్షణ కల్పిస్తూ.. ల్యాండ్ గ్రాబింగ్ చట్టాన్ని తీసుకొచ్చాం
- మంత్రి పొంగూరు నారాయణ

**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :**

ప్రజల ఆస్తికి భద్రత, రక్షణ కల్పించడమే లక్ష్యంగా భూసమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులను ప్రారంభించినట్లు రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. శుక్రవారం ఉదయం నెల్లూరు నగరంలోని 11వ వార్డు ఎన్టీఆర్ నగర్ వార్డు సచివాలయంలో రెవెన్యూ సదస్సును మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తూ క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ఈనెల 6వ తేదీ నుంచి జనవరి 8వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నట్లు మంత్రి చెప్పారు. ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం గత ప్రభుత్వం ప్రజల ఆస్తులను దోచుకునేందుకు తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ చట్టాన్ని రద్దుచేసి.. తమ ప్రభుత్వం నూతన చట్టం ల్యాండ్ గ్రాబింగ్-2024ను అమలులోకి తీసుకువచ్చిందన్నారు. ఈ చట్టం ప్రకారం ఎవరైనా ఇతరుల భూములను, ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే -మిగతా 2లో

### అంబేద్కర్ చేసిన పోరాటాల జ్యోతి..
## ఎంతో మంది జీవితాలలో వెలుగులు నింపుతోంది



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.. శుక్రవారం వీఆర్‌సీ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు, బలహీన అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాల జ్యోతి.. నేటికీ కూడా అనేక మంది జీవితాలలో వెలుగులు నింపుతూనే ఉందనే మాటలో ఎలాంటి అతిశయోక్తి లేదన్నారు. నాలాంటి ఎంతో మంది ఇలా మాట్లాడగలుగుతున్నామంటే.. అది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పోరాటాల ఫలితం అన్నారు. అంబేద్కర్ కేవలం అణగారిన వర్గాల కోసం మాత్రమే కాదు, మహిళలకు సమాన ఆస్తి హక్కు, మహిళలకు మెటర్నిటీ లీవ్స్ ఉండాలని ఒక దూరదృష్టి కలిగిన దార్శనికులు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం శక్తివంచన లేకుండా పోరాటం చేస్తామని తెలిపారు. అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకుని, వారి ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం నేటి యువతపై ఉందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, షఫీ, సిరాజ్, అరుణ్ పాల్గొన్నారు.



### తవ్వేకొద్దీ బయటపడుతున్న
# అవినీతి

- రూ.లక్షల్లో ప్రభుత్వానికి గండి
- నిమ్మకు నీరెత్తినట్లు ఉన్నతాధికారులు

**కావలి, మేజర్‌న్యూస్ :**

కావలి పట్టణంలో విద్యుత్ శాఖలో కొంత మంది ఉద్యోగుల ప్రభుత్వానికి లక్షల్లో వచ్చే ఆదాయానికి గండి కొట్టి ఉద్యోగులు తమ స్వలాభం కోసం లక్షల్లో లంచాలు తీసుకుంటూ ఉండడం విశేషం కావలి పట్టణంలో విద్యుత్ శాఖలో కొంత మంది అవినీతి అక్రమాలకు పాల్పడుతూ, ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. సెంటర్లో నూతనంగా బహుళ అంతస్తు నియమిస్తున్నారు. సుమారు రూ.2 కోట్ల పైబడి ఐదు ఫ్లోర్లపైన షాపింగ్ కాంప్లెక్స్‌ను నియమిస్తున్నారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్‌కి విద్యుత్ కావాలంటే ప్రభుత్వం ద్వారా ఆ కాంప్లెక్స్ కావలసిన విద్యుత్తు సామర్థ్యాన్ని బట్టి అక్కడ మీటర్లు నియమించాలి కానీ, అందుకు విరుద్ధంగా అధికారులు కొంత స్వలాభం ముట్టజెప్పి ప్రభుత్వానికి చెందాల్సినది -మిగతా 2లో

# రోడ్డు ప్రమాదాల నివారణే.. లక్ష్యం



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అవసరమైన రోడ్డు భద్రత చర్యలు సకాలంలో చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రోడ్డు భద్రత కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. తొలుత రోడ్డు ప్రమాదాల నివారణకు చేపడుతున్న కార్యక్రమాలను డీటీసీ చందర్ వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు తమ శాఖ ఆధ్వర్యంలో రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమాలను అన్ని కళాశాలలు, హైస్కూల్‌లలో చేపడుతున్నట్లు చందర్ చెప్పారు. గత సమావేశంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తీసుకున్న పలు నిర్ణయాలను అమలు చేయగా, మరికొన్ని పెండింగ్‌లో ఉన్నట్లు డీటీసీ తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను తప్పకుండా అమలు చేసిన తరువాత యాక్షన్ టెకన్ రిపోర్టుతో మీటింగ్‌కు హాజరు కావాలని సంబంధిత అధికారులకు సూచించారు. నెల్లూరు నగరంలో సిగ్నల్ పాయింట్లను త్వరగా వినియోగంలోకి తీసుకొచ్చేందుకు చర్యలు చేపట్టాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గొలగమూడి జంక్షన్ వద్ద లైటింగ్ మరింత పెంచాలని సూచించారు. జాతీయ రహదారిపై పశువులు సంచరించకుండా చూడాలని, పశువులకు రేడియం స్టిక్కర్లను అతికించాలని డీసీఓకు సూచించారు. జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించేలా చర్యలు చేపట్టాలని, హైవే ఎంట్రన్స్, ఎగ్జిట్స్ పాయింట్ల వద్ద ముమ్మరంగా తనిఖీలు చేపట్టి వాహనదారులు హెల్మెట్లు ధరించేలా చూడాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులపై కఠినచర్యలు తీసుకోవాలన్నారు. నగరంలో ఎంపిక చేసిన ప్రదేశాల్లో సీసీ కెమెరాలను త్వరగా ఏర్పాటు చేసి పోలీసు, మున్సిపల్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. ఈ-డార్ ఆన్‌లైన్ సిస్టంలో అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా డేటా ఎంట్రీ పూర్తిచేయాలని, అన్ని హాస్పిటల్స్‌లో ఇందులో నమోదయ్యేలా చూడాలని సూచించారు. ఈ డేటా ఆధారంగా ఏ ప్రదేశంలో ఎక్కడ ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయో తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలకు రెడ్ క్రాస్ సహకారంతో బ్రీత్ అనలైజర్ మిషన్లను అందించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. నెల్లూరు, పొదలకూరు రోడ్డులో డివైడర్ నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని సూచించారు. స్పీడ్ బ్రేకర్లకు పెయింటింగ్ వేయాలని సూచించారు. ప్రమాదం జరిగినప్పుడు క్షతగాత్రులను కాపాడిన వారికి గుడ్ సమ్మరిటన్ అవార్డులు అందించాలని, జనవరి 26 వేడుకల్లో వారిని సత్కరించేలా ప్రతిపాదించాలని సూచించారు.

నగరంలో ప్రైవేటు వాహనాలు నిలుపుదల చేసేందుకు పార్కింగ్ ప్రదేశాలను త్వరగా ఎంపిక చేయాలని సూచించారు. సమావేశంలో డీటీసీ చందర్, ఎన్‌హెచ్ డీజీఎం గోవర్ధన్, ఎన్‌హెచ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంకే చౌదరి, ఏఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ అడిషనల్ కమిషనర్ ఓబులేసు నందన్, పంచాయతీ రాజ్ ఎస్ఈ అశోక్‌కుమార్, డిఎంఅండ్‌హెచ్‌వో పెంచలయ్య, ఆర్‌అండ్‌బి ఈఈ మురళీకృష్ణ, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## హోంగార్డ్ వ్యవస్థకు, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలి

### ఎస్పీ కృష్ణకాంత్ - ఘనంగా 62వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు



**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** నీతి, నిజాయితీ, అంకితభావంతో పనిచేస్తూ హోంగార్డ్ వ్యవస్థకు, పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జిల్లా ఎస్పీ జి కృష్ణ కాంత్ తెలిపారు. 62వ హోంగార్డ్స్ ఆవిర్భావ దినోత్సవం సందర్భముగా ముఖ్యఅతిథిగా విచ్చేసి పోలీసు వాయిద్యాల మధ్య గౌరవ వందనం స్వీకరించి, హోంగార్డ్స్ అందరికి శుభాకాంక్షలు చెప్పారు. పోలీసులతో సమానంగా విధులు నిర్వహిస్తున్న మీ దాతృత్వ సేవలు ప్రశంసనీయమన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ, నేరనియంత్రణ, తుఫాన్ విపత్తు సమయంలో హోంగార్డుల సహకారం, ప్రజలకు చేసిన సేవలకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. పోలీస్ క్యాంటీన్‌లో సరుకులు తీసుకునేలా, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో క్వాలిఫై అయిన వారికి ఈవెంట్స్ ప్రాక్టీస్‌కు అవకాశం, పోలీస్ హాస్పిటల్‌లో ఉచిత వైద్యం, పిల్లల కాలేజ్ సీట్ల కేటాయింపులోనూ అవకాశం కల్పిస్తున్నట్లు వెల్లడించారు. హోంగార్డుల సంక్షేమంలో భాగంగా వారికి శాఖాపరమైన సదుపాయాలు, ప్రభుత్వ పథకాలు అమలు పరుస్తున్నామన్నారు. ఎటువంటి సమస్యనైన మా దృష్టికి తీసుకురండి.. మీకు తోడుగా ఉంటామన్నారు. మీ పిల్లలను బాగా చదివించాలని, వారు ఉన్నతస్థాయికి చేరుకునేలా లక్ష్యంగా పెట్టుకోవాలని సూచించారు. పోలీసులతో సమానంగా డ్రైవర్లు, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, నేరాల నియంత్రణ, కంప్యూటర్ ఆపరేటింగ్.. ఇలా చాలా రకాల విధుల్లో హోంగార్డుల పాత్ర కీలకమన్నారు. జిల్లాలో మొత్తం మహిళలతో కలిపి 701 మంది హోం గార్డులు ప్రధాన విభాగాలలో విధులు నిర్వహిస్తున్నారన్నారు. వరదలు, రొట్టెల పండుగ, వినాయకచవితి, తిరుమల బ్రహ్మోత్సవాలు, విజయవాడ బ్రహ్మోత్సవాలు, వీఐపీ బందోబస్తులను ఎంతో క్రమశిక్షణతో నిర్వహించి, జిల్లాకు మంచి పేరు తీసుకొచ్చారన్నారు. హోంగార్డుల సమస్యలన్నింటినీ సమగ్రంగా విని, సాధ్యాసాధ్యాలను బట్టి త్వరితగతిన పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) సౌజన్య, జిల్లా పోలీస్ అసోయేషన్ ప్రెసిడెంట్ ప్రసాద్, హోంగార్డు సిబ్బంది పాల్గొన్నారు.

## బాబాసాహెబ్‌కు కాకాని ఘన నివాళి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** మహనీయుడు, మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.. శుక్రవారం శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాబాసాహెబ్ చిత్రపటానికి మాజీ మంత్రి, నెల్లూరు జిల్లా వైసీపీ అధ్యక్షులు కాకాని గోవర్ధన్ రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సృష్టిలో సూర్యచంద్రులు ఉన్నన్ని రోజులు డాక్టర్ బీఆర్.అంబేద్కర్ ప్రజల హృదయాల్లో శాశ్వతంగా, చిరస్థాయిగా ఉండిపోతారని చెప్పారు. అంబేద్కర్ తన చిన్నతనం నుండి కుల వివక్ష, అంటరానితనం లాంటి ఎన్నో దురాగతాలను భరించి, భారత దేశంలో అత్యంత ఉన్నత స్థాయికి ఎదిగి, మహనీయుడిగా కీర్తించబడ్డారన్నారు. ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయాలను కొనసాగించేందుకు నిరంతరం శ్రమించారని పేర్కొన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా పేద, దళిత, బడుగు, బలహీన వర్గాలకు అన్ని విధాలా అండగా నిలిచారన్నారు. చంద్రబాబు హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసినట్లే, అంబేద్కర్ 125వ జయంతిని పురస్కరించుకొని 125 అడుగుల విగ్రహాన్ని ప్రతిష్టిస్తామని అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి, తర్వాత పట్టించుకోలేదని తెలిపారు. జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే, విజయవాడ నడిబొడ్డున స్వరాజ్ మైదానంలో ఆంధ్రులందరూ గర్వించే విధంగా, 125 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి, దేశానికే ఆదర్శంగా నిలిచారన్నారు. జగన్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మహనీయుడు అంబేద్కర్ ఆశయ సాధన కోసం వైసీపీ శ్రేణులందరం కలిసికట్టుగా కృషి చేస్తామని చెప్పారు.

## తవ్వేకొద్దీ బయటపడుతున్న అవినీతి

*(మొదటి పేజీ తరువాయి)*

చెందనీయకుండా ఉద్యోగులు ఈ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారు. ఆ బహుళ అంతస్తు భవనానికి సరిపోయే విద్యుత్తు ట్రాన్స్‌ఫారం నిర్మించుకోవాలంటే, కట్టుకునే భవనం లోపలనే ట్రాన్స్‌ఫారంను నియమించుకోవాలి, అయితే విద్యుత్ అధికారులు తన చేతివాటం చూపించి అధిక మొత్తంలో వారి దగ్గర లాభాపేక్షతో ప్రభుత్వ ఆదాయానికి గండికొడుతున్నారు. ఈ విషయంపై కావలి డివిజనల్ ఇంజనీర్ డీకే బెనర్జీని 'సూర్య' పాత్రికేయులు వివరణ అడగగా, మాకు ఈ విషయం తెలియదు. ఇప్పుడే ఈ విషయంపై విచారణ జరిపిస్తామని తెలిపారు. ఒక ఉన్నతాధికారిగా ఉండి కింద జరుగుతున్న అవినీతి అక్రమాలపై పర్యవేక్షించాల్సిన అధికారులే 'కంచె చేను మేస్తే' అన్నట్లు సామెతగా ఉన్నట్లు విశ్లేషకులు తమ వాదనను వినిపిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ కావలి పట్టణం నియోజకవర్గంలో కొంత మంది విద్యుత్ శాఖ ఉద్యోగులు అవినీతికి పాల్పడుతూ, ఉన్నతాధికారులు సైతం మైమరిపించే విధంగా వారిని మలచుతున్నట్లు ప్రజలు, ప్రజా సంఘాలు తమ వాదనను గట్టిగా వినిపిస్తున్నారు. కావలి పట్టణంలో ఎక్కడ పది మంది గుమిగూడినా.. టీకొట్టు దగ్గర చర్చించుకుంటున్నా.. అది విద్యుత్ శాఖలో జరుగుతున్న అవినీతి గురించే కావడం గమనార్హం. కావలి పట్టణ విద్యుత్ శాఖ మొత్తాన్ని ఒక ఏఈ స్థాయి అధికారి కనుసన్నల్లో ఈ అవినీతి అక్రమాలు జరుగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

## ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే లక్ష్యంగా.. రెవెన్యూ సదస్సులు

*(మొదటి పేజీ తరువాయి)*

నాన్‌బెయిలబుల్ కింద పది నుంచి 14 ఏళ్ల వరకు జైలు శిక్ష, భూమి విలువను చెల్లించేలా నిబంధనలు పొందుపరిచినట్లు మంత్రి స్పష్టం చేశారు. సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తూ.. గత ప్రభుత్వ పాలకులు వేల ఎకరాల భూములను కబ్జా చేశారని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల దగ్గర నుంచి పట్టణ ప్రాంతాల దాకా.. కోట్ల విలువ చేసే భూములను వారు హస్తగతం చేసుకున్నారని మండిపడ్డారు. రెవెన్యూ శాఖలో ఉండే లోపాలను సరిదిద్ది.. నిజమైన అర్హుడుకే న్యాయం చేసేలా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను తీసుకొచ్చినట్లు తెలిపారు. ప్రజల ఆస్తిని కాపాడేందుకే సీఎం చంద్రబాబు ఈ నిర్ణయం తీసుకున్నారని వెల్లడించారు. రెవెన్యూ సదస్సులో వచ్చిన భూ సమస్యలను నెల రోజుల్లోనే అధికారులు పరిష్కరిస్తారన్నారు. ప్రజా సమస్యల పరిష్కరించే విధంగా చట్టాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అనంతరం మంత్రి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వీలైనంత త్వరగా భూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం అర్జీల ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను మంత్రి, కలెక్టర్ స్వయంగా పరిశీలించారు.

### ప్రజల ముంగిటకే రెవెన్యూ యంత్రాంగం

ప్రజల ముంగిటకే రెవెన్యూ యంత్రాంగం కదిలివచ్చి భూసమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టడమే రెవెన్యూ సదస్సుల ప్రధాన లక్ష్యంగా జిల్లా కలెక్టర్ ఆనంద్ చెప్పారు. రెవెన్యూ గ్రామసభలో కలెక్టర్ మాట్లాడుతూ.. ఈనెల 6 నుంచి జనవరి 8వ తేదీ వరకు ప్రతి గ్రామంలో షెడ్యూలు ప్రకారం గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. ఆ గ్రామానికి సంబంధించి అన్ని పూర్తి రికార్డులను గ్రామసభ జరిగే రోజున గ్రామానికి తీసుకెళ్లి ప్రజల సమక్షంలోనే వారి భూ సమస్యలను ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. అప్పటికప్పుడు పరిష్కారమయ్యే సమస్యలను గ్రామసభల్లోనే పరిష్కరిస్తామని, పేర్లు, వారసత్వం, మ్యూటేషన్ వంటి సమస్యలను రెవెన్యూ రికార్డులను పరిశీలించి నిర్దిష్ట గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నట్లు కలెక్టర్ చెప్పారు. రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించిన కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, రైస్ కార్డులు మొదలగు అంశాలను కూడా నమోదు చేసుకుని పరిష్కరిస్తామన్నారు. జిల్లాలో 300 గ్రామాల్లో రీసర్వే గ్రామసభలు ఇప్పటికే నిర్వహించి అర్జీలు స్వీకరించామని, సుమారు 8వేలకు పైగా అర్జీలు ఈ రీసర్వే సభల్లో రాగా ఇప్పటికి 1500పైగా అర్జీలు పరిష్కరించినట్లు చెప్పారు.



రీసర్వే జరగని 400కు పైగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూసమస్యలపై అర్జీలు స్వీకరించేందుకు ప్రాధాన్యత ఇస్తామన్నారు. అనంతరం రీసర్వే జరిగిన గ్రామాల్లో కూడా రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ చెప్పారు. ప్రజలందరూ కూడా ఈ రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని భూ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, ఆర్డీఓ అనూష, తహసిల్దార్ షఫీమాలిక్ పాల్గొన్నారు.

# నేడే బడి పండుగ

- మధుర జ్ఞాపకంగా నిలిపేందుకు కృషి
- తల్లిదండ్రుల ఉపాధ్యాయుల ఉత్సుకత
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్‌కు పూర్తి సన్నద్ధం
- జిల్లా కలెక్టర్ ఆనంద్



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** ఎటువంటి ఆర్భాటాలు లేకుండా పూర్తిస్థాయి విద్యా వాతావరణంలో తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలకు జిల్లాలోని పాఠశాలలు సిద్ధమయ్యాయని జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ తెలిపారు. మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ సన్నాహకాలపై జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులు, ఎంపీడీఓ, ఎంఈఓలతో శుక్రవారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ విద్యపై తల్లిదండ్రుల్లో మరింత నమ్మకం పెంచే విధంగా, విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం పెంపొందించేందుకు, తల్లిదండ్రులకు ఉపాధ్యాయులకు మధ్య సానుకూల అనుబంధం ఏర్పడేందుకు ఉద్దేశించిన తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశం జిల్లాలోని 2604 పాఠశాలల్లో నేడు జరగనుందన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించాల్సిన కార్యక్రమాలకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని, అందుకగుణంగా ఏర్పడిన వివిధ కమిటీల ఆధ్వర్యంలో ఆయా కార్యక్రమాలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాటులు పూర్తి చేశామన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఒకే వేదికను పంచుకొని వారి బిడ్డల బంగారు భవిష్యత్తుకు పునాది వేసేందుకు, విద్యార్థుల విద్యా పురోగతి గురించి చర్చించనున్నారని, అదే సమయంలో పాఠశాల అభివృద్ధి గురించి పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలందరినీ భాగస్వామ్యం చేసి పాఠశాలలకు వసతులు సమకూర్చుకునేందుకు అవసరమైన విధివిధానాలపై చర్చిస్తారన్నారు. ఇక ప్రతి రోజూ పిల్లలకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనంను తల్లిదండ్రులకు కూడా అందిస్తారని ఇందులో వైట్ రైస్, పప్పు లేదా పప్పు చారు, వెజిటబుల్ కర్రీ, స్వీట్ పొంగల్, చిక్కి, రాగిజావ ఖచ్చితంగా ఉంటాయన్నారు. జిల్లాలో పెద్ద ఎత్తున నిర్వహించే ఈ సమావేశాలకు కలెక్టరేట్లో ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు పనిచేసే విధంగా కంట్రోల్ రూమ్‌ను (నెంబర్ : 0861 – 2331261) ఏర్పాటు చేశామన్నారు. ఈ సమావేశాల సందర్భంలో జిల్లాలో ఏదైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే కంట్రోల్ రూమ్‌ను సంప్రదించవలసిందిగా కోరారు. ఈ సమావేశాలకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరిగే సమావేశంలో పాల్గొంటారని, అలాగే మంత్రి పొంగూరు నారాయణ నగరంలోని నవాబ్ పేట బీవీయస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో పాల్గొంటారన్నారు. ఇదేవిధంగా జిల్లాలోని అందరు ప్రజా ప్రతినిధులు వివిధ పాఠశాలల్లో పాల్గొంటారని తెలిపారు.

## జర్నలిస్టులకు ఇళ్లు నిర్మించి ఇస్తా

### మంత్రి నారాయణ హామీ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలో పని చేస్తున్న జర్నలిస్టులకు సిటి పరిధిలోనే అత్యధిక వసతులతో ఇళ్లను నిర్మించి ఇస్తానని రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి పొంగురు నారాయణ హామీ ఇచ్చారు. శుక్రవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో మంత్రి నారాయణను జర్నలిస్టు నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం మంత్రి నారాయణ స్పందిస్తూ.. మార్చి 2025లోపే నెల్లూరు సిటి పరిధిలోనే స్థల సేకరణ చేసి అత్యధిక వసతులతో గ్రేటర్ కమ్యూనిటీ లెవల్‌లో ఇళ్లను నిర్మించి ఇస్తానని హామీ ఇచ్చారు. దీంతో జర్నలిస్టు సంఘం నాయకులు మల్లికార్జున్, శ్రవణ్ సురేష్, మహబూబ్ బాషాతో పాటు పలువురు జర్నలిస్టులు కృతజ్ఞతలు తెలిపారు.

## అణగారిన వర్గాల ఆశాజ్యోతి బీఆర్ అంబేద్కర్

### మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** అణగారిన వర్గాల ఆశాజ్యోతి, వారి గుండె దివ్వెలు వెలిగించిన భానుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా.. నెల్లూరు ఏసీ నగర్‌లోని బీసీకేసీ కళ్యాణ మండపంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ.. అంబేద్కర్ పోరాటమంతా బహుజనుల రాజ్యాధికారం దిశగానే సాగిందన్నారు. అణగారిన వర్గాల గొంతుకను వినిపించిన మహోన్నత వ్యక్తి అంబేద్కర్ అని, ఆయన ఆశయాల సాధన కోసం సీఎం చంద్రబాబు నాయుడు నిరంతరం శ్రమిస్తున్నారని వెల్లడించారు. గత ప్రభుత్వాలు అంబేద్కర్ ఆశయాలపై నీళ్ళు చల్లాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేద్కర్ పోరాట పటిమను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అంబేద్కర్‌కు నివాళి అర్పించిన అనంతరం.. రెవెన్యూ సదస్సులో మంత్రి పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలపై నారా లోకేష్‌కు వినతి పత్రం



**దగదర్తి, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను వారి ఇంటి వద్ద ఏపీఆర్, ఎస్సీ, ఎస్టి, ఈఎస్ఏ తరపున శుక్రవారం కలిసి ఉద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై సమస్యలను వివరించారు. పిఆర్సి, డిఏ, సరెండర్ లీవ్ తదితర అంశాల గురించి వివరించగా, త్వరలో పిఆర్‌సి కమిటీ చైర్మన్ నియామకం జరుగుతుందని, ఉద్యోగ ఉపాధ్యాయులు పడిన కష్టాన్ని గుర్తించామని, రాష్ట్ర ప్రభుత్వం లోటు బడ్జెట్‌లో ఉన్నప్పటికీ జనవరి నుంచి దశల వారీగా అన్ని బకాయిలు చెల్లిస్తామని తెలిపారు. పలు జిల్లాల్లో వీఆర్ఏ నుంచి వీఆర్వో పదోన్నతులు కల్పించడం లేదని తెలుపగా, తగు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. వీఆర్వో, విఎస్‌ల జీతభత్యాలు తహసీల్దారు వారి ద్వారా ఇవ్వకపోవడం వల్ల వారు పలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పగా, ఈ విషయంపై చర్చించి వీఆర్వో, విఎస్‌ల జీతాల పూర్తిగా రెవెన్యూ శాఖ పరిధిలో ఉంచేలా ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు. తహసీల్దార్ కార్యాలయాలు శిధిలావస్థలో ఉన్నాయని, గ్రామ సచివాలయం భవనాలు మండల కేంద్రాలలో ఉన్న వాటిలో ఒక అంతస్తును మంజూరు చేయాలని కోరగా, ప్రస్తుత పరిస్థితులలో రాష్ట్ర ఖజానాకు ఆర్థిక భారం లేని సూచనలు చేసినందుకు మెచ్చుకుంటూ, అతి త్వరలో ఉత్తర్వులు ఇస్తామని తెలిపారు. ఏసీబీ తదితర క్రమశిక్షణా చర్యలు కొన్ని సంవత్సరాలుగా విచారణ కొనసాగుతున్నందున వారి కుటుంబాలు పడుతున్న వేదనను గమనించి త్వరితగతిన పూర్తి చేయమని తెలుపగా, నిర్ణీత వ్యవధిలో విచారణను పూర్తి చేసేలాగా అన్ని శాఖలకు ఉత్తర్వులు జారీ చేస్తామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణ రాష్ట్రానికి 1800 మంది, అక్కడ నుంచి ఇక్కడకు 1300 మంది అంతర్రాష్ట్ర బదిలీల కోసం దాఖలు చేసుకున్నారని, కావున వారి సమస్యను పరిష్కరించమని కోరగా, రాష్ట్ర విభజన కమిటీ దృష్టికి వెంటనే తీసుకు వెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. రీ సర్వే డిటిల జీతాలు సుమారు 3 నెలల నుంచి రావడం లేదని, దాని వల్ల రీ సర్వే డిటిలు పలు ఇబ్బందులు పడుతున్నారని తెలియజేయగా, ఈ విషయం తన దృష్టిలో వున్నదని, కొద్ది రోజులలో వారి జీతాలకు సంబంధించిన ఉత్తర్వులు వస్తాయని తెలిపారు. ఇతర రెవెన్యూ, ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల చాలా సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షులు సిహెచ్. చిట్టిబాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరీష్ మొలతాటి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లక్ష్మీ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

## బిల్డింగ్ అనుమతులకు నూతన విధానాన్ని తీసుకువస్తున్నాం

### రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** బిల్డింగ్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో పర్మిషన్ ఇచ్చే నూతన విధానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కమాండ్ కంట్రోల్‌లో శుక్రవారం మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిల్డింగ్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో పర్మిషన్ ఇచ్చే నూతన విధానాన్ని త్వరలో తీసుకువస్తున్నామన్నారు. వివిధ లేఅవుట్‌లలో పార్కుల కోసం కేటాయించిన భూమిని ఖచ్చితంగా పార్కుల కోసమే వినియోగించాలన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థ ను ప్రతివారం సమీక్షిస్తున్నామని, నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నగరంలోని పార్కులను సెంట్రల్ లైటింగ్ సిస్టంను అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ప్రజలు కూడా వివిధ రకాల రెవెన్యూ బకాయిలను చెల్లించాలన్నారు. ఇప్పటికే నాలుగు నెలల కాలంలో ఆరున్నర కోట్ల రెవెన్యూ బకాయిలు ప్రజలు చెల్లించారని, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతావారు కూడా పెండింగ్‌లో ఉన్న రూ.120 కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు. ప్రజలు చెల్లించిన సొమ్మును తిరిగి ప్రజావసరాలకే వినియోగించాలన్నారు. అప్పుడే నగర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. నెల్లూరు నగరంలో పుట్టి.. దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరువాసులు నగరంలోని అభివృద్ధి చేసిన పార్కులను దత్తత తీసుకుని నిర్వహణ చేపట్టాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా నగరంలోని పశువుల సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక వాహనం కేటాయిస్తున్నామన్నారు. అలాగే వీధి కుక్కల పునరుత్పత్తికి అవకాశం లేకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎన్ఎక్స్ స్టెమ్ ల్యాబ్ ప్రారంభోత్సవం




**విడవలూరు, మేజర్‌న్యూస్ :** షెల్ ఇండియా సహకారంతో స్మైల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని రామతీర్థం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఎన్ఎక్స్ స్టెమ్ ల్యాబ్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న మండల విద్యాశాఖ అధికారులు నాగ పద్మ, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ ఫౌండేషన్ ద్వారా నెల్లూరు జిల్లాలోని 53 పాఠశాలకి ఐక్యరాజ్య సమితి ప్రతిపాధించిన సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై అవగాహన కల్పిస్తూ స్టెమ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. తద్వారా విద్యార్థులకి భవిష్యత్‌లో రాబోయే అతి పెద్ద సవాళ్ళను ఎదుర్కొనేలా, వినూత్న ఆలోచనలతో కూడిన శాస్త్రీయ పరిజ్ఞానం జోడిస్తూ సైన్స్ ప్రాజెక్ట్స్ తయారు చేసేలా వారికి అవగాహన కల్పించడం జరిగిందన్నారు. ఇందుకు కావలసిన అన్ని మెటీరియల్స్ ఆదిస్తున్నారని, ఇది చాలా హర్షించవలసిన విషయమని కొనియాడారు. అంతే కాకుండా నెల్లూరు జిల్లాలోని 10 ఎంపిక చేసిన పాఠశాలలో 2 లక్షలు విలువచేసే స్మార్ట్ టీవీ, లాప్ టాప్, ఇన్వెర్టర్, సైన్స్ ప్రాజెక్ట్స్ మెటీరియల్, కార్నర్ పెయింటింగ్లను ఎన్ఎక్స్ లాబ్స్ ఏర్పాటు చేసి ఇవ్వడం జరిగిందని, ఈ అవకాశాన్ని పిల్లలు, ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు శేషయ్య మాట్లాడుతూ.. షెల్, స్మైల్ ఫౌండేషన్ వారు అందిస్తున్న ఈ సహకారం పిల్లలు భావి శాస్త్రవేత్తలుగా ఎదగడానికి ఎంతగానో సహకరిస్తుందని వారికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి స్మైల్ ఫౌండేషన్ ప్రతినిధిగా విచ్చేసిన రాష్ట్ర సమన్వయ కర్త విజయ సారధి మాట్లాడుతూ.. పిల్లలు సరికొత్త ఆలోచనలుతో భవిష్యత్‌లో రాబోయే విపత్తులకు పరిష్కారాలు సాధించే దిశగా అడుగులు వేసి గొప్ప శాస్త్రవేత్తలుగా తయారు అవ్వాలి అన్నదే షెల్, స్మైల్ ఫౌండేషన్ లక్ష్యం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి పాఠశాల ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు, సిబ్బంది, పాఠశాల కార్యనిర్వహణ కమిటీ సభ్యులు, విద్యార్థిని, విద్యార్థులు, స్మైల్ ఫౌండేషన్ స్టెమ్ ఫెసిలిటేటర్లు పాల్గొన్నారు.

# వీఎస్‌యూలో విద్యార్థి ప్రవేశోత్సవ కార్యక్రమం




**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** కాకుటూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ప్రాంగణంలోని అబ్దుల్ కలాం భవనంలో శుక్రవారం మధ్యాహ్నం విద్యార్థి ప్రవేశోత్సవ కార్యక్రమం విద్యార్థుల సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆచార్య ఎస్.విజయభాస్కర రావు, గౌరవనీయ ఉపకులపతి (ఇన్‌చార్జ్), ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జి.కృష్ణకాంత్, ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్, ప్రత్యేక అతిథిగా విచ్చేసి తన సందేశాన్ని అందజేశారు. డాక్టర్ కె.సునీత, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ (ఇన్‌చార్జ్), గౌరవ అతిథిగా పాల్గొన్నారు. జి.కృష్ణకాంత్ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ.. "మీరు ఏ రంగంలో అయినా ఉత్తమ విజయాన్ని సాధించాలనుకుంటే, మీరు చేసే ప్రతి పనిలో కృషి, నిబద్ధత, సమయపాలన ఉండాలి. మీరు పాఠశాల కాలం నుండి మీ లక్ష్యాలపై దృష్టి పెట్టండి, అలాగే సమాజానికి మీరు చేయగలిగే మంచి పనులను గుర్తించండి. విద్య నేర్చుకోవడం ఒక్కటే కాక, మనస్సును నిర్మాణాత్మకంగా తీర్చిదిద్దడం కూడా ముఖ్యం. విద్యార్థులు ఎటువంటి చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ముఖ్యంగా గంజాయి, సెల్ ఫోన్, వాట్స్ యాప్ మొదలైనవి జీవితాన్ని ముందుకు సాగే ప్రయాణాన్ని పెడదోవన పటిస్తాయి అని విద్యార్థులు తగు జాగ్రతలు తీసుకోవాలని తెలియజేశారు. ఆచార్య ఎస్.విజయభాస్కర రావు, గౌరవనీయ ఉపకులపతి ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ.. మన దేశంలో విద్య ప్రతి వ్యక్తికి సమానంగా అందించబడాలి. విద్య దేశానికి, సమాజానికి అభివృద్ధిని తీసుకువస్తుంది. విద్యార్థులు తమ గమనాన్ని నిర్దేశించుకోవాలి, కేవలం చదవడం మాత్రమే కాక, వాటిని అన్వయించుకోవడం, సృజనాత్మకతతో ఆలోచించడం చాలా ముఖ్యమే. మీరు జీవితంలో ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలనుకుంటే, మీరు చేసిన ప్రతి పని ప్రేమతో, శ్రమతో, నిబద్ధతతో చేయాలి. స్వయంగా అభివృద్ధి చెందడం మాత్రమే కాకుండా, సమాజానికి సేవ చేయడం కూడా ప్రతి విద్యార్థి బాధ్యత. ఈ విశ్వవిద్యాలయం మీకు అందించిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని, మీరు సృష్టించే ప్రతిభతో దేశం, సమాజం వెలుగు వెలగాలని ఆశిస్తున్నాను అని ఆయన విద్యార్థులకు ధైర్యం కల్పించారు. అంతరం, డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ.. ఈ విశ్వవిద్యాలయం మీకు అద్భుతమైన అవకాశాలు అందిస్తోంది. మీరు ఈ కళాశాలలో అడుగుపెట్టిన క్షణం నుండి, మీరు ఆధ్యాత్మికంగా, మానసికంగా, శారీరకంగా ఎదగాలని నేను ఆశిస్తున్నాను. మంచి విద్యే మీకు భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు, మంచి జీవితం, సమాజంలో మంచి స్థానం ఇవ్వగలదు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇన్‌ఛార్జ్ డా.ఎం.హనుమా రెడ్డి, అధ్యాపకులు మరియు విద్యర్థులు పాల్గొన్నారు. విద్యార్థులకు సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించి విజేతలకు భహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ కె.సునీత, విశ్వవిద్యాలయ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.హనుమారెడ్డి, డాక్టర్ ఎస్‌బి సాయినాద్, డాక్టర్ మేరి సంధిప, అధ్యాపకులు విద్యార్థు పాల్గొనారు.

# రేపటి నుంచి దత్త జయంతి ఉత్సవాలు



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** శ్రీ దత్త జయంతి ఉత్సవాలు ఈనెల 8నుండి 14వ తేదీ వరకు జరుగుతాయని శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం నెల్లూరు జిల్లా జర్నలిస్ట్ భవన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీ సాయి భరద్వాజ సత్సంగ బృందం నెల్లూరు ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు శ్రీ దత్త జయంతి ఉత్సవములు ఘనంగా జరుగుతాయని చెప్పారు. ఈనెల 14వ తేదీ న దత్త జయంతి సందర్భంగా నెల్లూరు నగరంలోని టౌన్ హాల్ నందు డిసెంబర్ 8వ తేదీ నుండి 14వ తేదీ వరకు సాయంత్రం 6 గంటల నుండి 8:30 వరకు శ్రీ దత్త జయంతి ఉత్సవములు జరుగుతాయని తెలిపారు. దత్తాత్రేయ అవతారంలోని మొదటి అవతారం శ్రీ పాద శ్రీ వల్లభుడు రెండవ అవతారం శ్రీ నరసింహ సరస్వతి స్వామి వారి చరిత్ర 12వ సంవత్సరంలో శ్రీ కపిలవాయి అచ్యుత రామారావు ఖమ్మం జిల్లా తెలంగాణ నుంచి గురు చరిత్రని ప్రవచన రూపంలోతెలియజేస్తారని పేర్కొన్నారు. 8వ తేదీ సాయంత్రం దత్త సాయి మందిరం గాంధీ బొమ్మ దగ్గర నుండి ఆత్మల పాదుకల రూపంలో కంచి చంద్రశేఖర సరస్వతి స్వామి వారి పాదుకలు, శ్రీ భరద్వాజ మహారాజు పాదుకలు, శ్రీ రామిరెడ్డి తాత పాదుకలు, నాంపల్లి బాబా వారి పాదుకలు, శ్రీ వెంకయ్య స్వామి వస్త్రాలతో ఊరేగింపుగా బయలుదేరి నెల్లూరు టౌన్ హాల్ లోని వేదిక వద్దకు తీసుకు రావడం జరుగుతుందని తెలియజేశారు. దత్త సాయి మంత్రం కమిటీ వారి సహకారంతో శ్రీ సాయి భరద్వాజ సత్సంగం వారు కలిసి 12 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. కావున శ్రీ సాయి దత్త భక్తులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ సాయి భరద్వాజ సత్సంగ బృందం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు జాబ్ మేళా.

**విడవలూరు, మేజర్‌న్యూస్ :** మండలంలోని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చెముకుల శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా వీపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ కంపెనీల ప్రతినిధులతో విడవలూరు ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో ఉదయం 9 గంటల నుంచి జాబ్ మేళాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా తొలిదశ కింద గాదెలదిన్నె, వావిళ్ళ, దంపూరు, విడవలూరు పార్లపల్లి, పంచాయతీలకు చెందిన యువతీ యువకులు మాత్రమే హాజరు కావాలని ఆయన కోరారు. మిగిలిన పంచాయతీ వారికి వివిధ దశలో జాబ్ మేళా నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు.

## అంబేద్కర్‌కి ఘన నివాళి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అందరికీ ఆదర్శనీయుడని అలాంటి వ్యక్తి అడుగుజాడల్లో నడవటం అవసరమని అన్నారు. ఆయన రాసిన రాజ్యాంగం ద్వారా సమాజంలో అందరూ సమానంగా ఉంటున్నామని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల దళిత నాయకులు స్థానికులు పాల్గొన్నారు.

## యంత్రసామాగ్రి అందుబాటులో ఉంచాలని వినతి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి మార్కెట్ యార్డు పరిధిలోని పసుపు రైతుల సౌకర్యార్థం అవసరమైన యంత్ర సామాగ్రిని అందుబాటులో ఉంచాలని రైతు సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం పసుపు రైతులు మార్కెట్ కమిటీ కార్యదర్శి ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు కాకు వెంకటయ్య మాట్లాడుతూ.. జిల్లాలో ఎక్కడాలేని విధంగా ఉదయగిరి మండలంలో పసుపు పంట సాగు చేస్తారన్నారు. పసుపు ఉడక బెట్టేందుకు బాయిలర్స్, పాలీస్ మిషన్లు అందుబాటులో లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ యంత్రాలను ప్రస్తుతం రైతులు కడప, కృష్ణా జిల్లాల నుంచీ అద్దెకు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందన్నారు. దీంతో ఈ ప్రాంత రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడడంతోపాటు వ్యయప్రయాసాలకు గురవుతున్నారన్నారు. మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఆయా యంత్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు ఇబ్బందులు తొలుగుతాయన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## లక్కీడ్రా విజేతలకు బహుమతులు ప్రదానం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఉదయగిరి ఆర్టీసీ డిపో పరిధిలోని సీతారామపురం మార్గంలో ఏర్పాటు చేసిన గిఫ్ట్ బాక్సు లక్కీడ్రాలో విజేతలకు శుక్రవారం డిపో మేనేజర్ శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిఫ్స్కీంకు ఆ మార్గంలో ప్రయాణికుల నుంచి ఆదరణ లభిస్తుం దన్నారు. ప్రతినెలా లక్కీడ్రా తీయడం జరుగుతుందన్నారు. ప్రయాణికులను ఆర్టీసీకి మరింత చేరువ చేసేందుకు ఈ పథకాన్ని ప్రవేశపెట్టామన్నారు. అనంతరం లక్కీడ్రా విజతేలైన ముజీబా. చెన్నమ్మలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఐ నాగభూషణం, ఏడీసీ వెంకటేశ్వర్లు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూ సదస్సును ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోండి

● ప్రజలకు మేలు చేసే ప్రభుత్వం కూటమి ప్రభుత్వం రెవిన్యూ సదస్సులు ● కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి వెల్లడి




**కావలి, మేజర్‌న్యూస్ :** ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాల డిసెంబర్ 6 నుండి జనవరి 8వ తేదీ వరకు జరిగే రెవిన్యూ సదస్సులను చేసుకోవాలని కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం కావలి రూరల్ మండలం రుద్రకోట గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ముందుగా సచివాలయం దగ్గర ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం అధికారులతో కలిసి రెవిన్యూ సదస్సులో పాల్గొని అర్జీలు స్వీకరించారు. అనంతరం శాసనసభ్యులు ప్రజల ఆస్తులకు పూర్తి రక్షణ కల్పిస్తూ క్షేత్రస్థాయిలో భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కావాలి నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో రెవెన్యూ సదస్సులు 45 రోజుల్లో వాటిని పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం కృషి చేస్తున్నారని ప్రజలకు మంచి చేసే ప్రభుత్వమే కూటమి ప్రభుత్వమని తెలిపారు. రాజకీయంగా ఎంతో పేరు తెచ్చి నా పంచాయతీ రుద్రకోట అని ఈ గ్రామాన్ని ఎన్నికల సమయంలో దత్తత తీసుకుంటానని చెప్పానని, రుద్రకోట గ్రామాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసి చూపుతానని ఎమ్మెల్యే తెలిపారు. మీ సమస్య ఏది ఉన్న పరిశీలించేందుకు ప్రతి నిమిషం అధికారులు నాయకులు అండగా ఉంటారని తెలిపారు. చంద్రబాబు ఆశీస్సులతో కావలి నియోజకవర్గాన్ని అభివృద్ధి పదంలో ముందుకు పోతుందన్నారు. ఏ అవసరం ఉన్న మీరు నా దగ్గరికి ఏ సమయంలోనైనా రావచ్చని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కావలి ఆర్డిఓ వంశీకృష్ణ మండల స్పెషల్ ఆఫీసర్ మల్లారెడ్డి, తహసిల్దార్ శ్రావణ్ కుమార్, కావలి రూరల్ రెవిన్యూ అధికారులు, సిబ్బంది సచివాలయం సిబ్బంది, ప్రజలు రైతులు పాల్గొన్నారు.

# పరిష్కారమే లక్ష్యంగా రెవిన్యూ సదస్సులు స్ఫూర్తి రెడ్డి




**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం నాయుడు పాలెం గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సు ముఖ్యఅతిథిగా కొడవలూరు మండల స్పెషల్ ఆఫీసర్ వ్యవసాయ శాఖ సంచాలకులు సత్యవాణి పాల్గొన్నారని, రైతులు తమ తమ సమస్యలను అర్జీ ద్వారా తెలియజేశారని, వారికి త్వరితగతిన ఆ సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందని గ్రామాలలో రెవెన్యూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని గతంలో భూ సమస్యలకు సంబంధించి అభ్యంతరాలను సదస్సులలో అధికారులు దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కరించుకోవచ్చని భూ కొలతలలో తేడాలు ఉన్న సర్వే నంబర్లు మార్పులు ఉన్న వారసత్వాలు నమోదు సరిహద్దులలో సమస్యలు విస్తీర్ణంలో తేడాలు ఉన్న సీలింగ్ భూములు కబ్జాలు అయినా అసైన్డ్ భూములు చుక్కల భూముల సమస్యలు అన్ని కూడా ఈ రెవెన్యూ సదస్సులో పరిష్కరించుకోవచ్చని మండల తహసిల్దార్ స్ఫూర్తిరెడ్డి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొడవలూరు మండల స్పెషల్ ఆఫీసర్ వ్యవసాయ శాఖ సంచాలకులు సత్యవాణి తాసిల్దార్ స్ఫూర్తి మండల సర్వేయర్ శ్రీలత రెవిన్యూ ఇన్స్పెక్టర్ సునీల్ తెలుగుదేశం పార్టీ నాయకులు మాగుంట సతీష్ రెడ్డి నాయుడుపాలెం గ్రామస్తులు పాల్గొన్నారు.

# అంబేద్కర్‌కు ఘన నివాళి



**నెల్లూరు, మేజర్‌న్యూస్ :** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్‌కు నెల్లూరు సిటీ వైసీపీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ పార్వతిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశానికి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన సేవలను వారు గుర్తు చేసుకున్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారతదేశానికి ఎంతో విలువైన రాజ్యాంగాన్ని అందించారని చెప్పారు. బడుగు బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చేసిన కృషి ఎనలేనిదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ వర్గాల ప్రజలు సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా చైతన్యవంతులయ్యారంటే అది అంబేద్కర్ చూపించిన చొరవేనని పేర్కొన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని తెలిపారు. వైసీపీ అధినేత వైయస్ జగన్మోహన్‌రెడ్డి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా బడుగు బలహీన వర్గాల ప్రజలకు రాజ్యాధికారం కల్పించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, మైనార్టీ సెల్ ఉపాధ్యక్షులు హంజా హుస్సేని, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, వైసీపీ నాయకులు కరీముల్లా, అలీం, పెంచలయ్య, విద్యార్థి విభాగం నాయకులు శేష సాయి తదితరులు పాల్గొన్నారు.

# శాస్త్రోక్తంగా శ్రీదేవి భూదేవి, చెన్నకేశవ స్వామి విగ్రహ ప్రతిష్ట



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** విడవలూరు మండలం గాదెలదిన్నె హరిజనవాడలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని శుక్రవారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విగ్రహ ప్రతిష్టకు కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈ నగదుని టీడీపీ మండల ఇన్‌చార్జ్ అడపాల శ్రీధర్ రెడ్డి, టీడీపీ నాయకులు బెజవాడ వంశీకృష్ణారెడ్డిలు ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. తొలుత ఆలయ పూజారులు శ్రీమాన్ పరంకుశం, అనంత పద్మనాభచార్యులు గణపతి పూజ విమాన కలశ ప్రతిష్ట నిర్వహించి అనంతరం విగ్రహ ప్రతిష్టను చేశారు. వందలాదిమందిగా తరలివచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లకు తాళిబొట్టు ముక్కుపుడకలు, అందజేశారు. తదుపరి పూజారులుస్వామి అమ్మవార్ల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

# ప్రభుత్వ పథకాలకు పోస్టాఫీస్‌లో అకౌంటు తప్పనిసరి కాదు



**నెల్లూరు సిటీ, మేజర్‌న్యూస్ :** ప్రజలు అవగాహన లోపంతో పోస్ట్ ఆఫీస్‌ల వద్ద భారీగా క్యూలైన్లో నిలబడి, కొత్త అకౌంట్ ఓపెన్ చేస్తేనే , ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు పడతాయని ప్రజలు అపోహలో ఉన్నారని బిజెపి జిల్లా కార్యదర్శి చిలకా ప్రవీణ్ అన్నారు. ఏ బ్యాంకులోనైనా అకౌంట్ ఉండవచ్చని ఆధార్‌కి లింక్ చేసిన బ్యాంక్ అకౌంట్లో ప్రభుత్వ సంక్షేమ పథకాల డబ్బులు పడతాయని, ఒకవేళ బ్యాంక్ అకౌంట్‌కి ఎన్పీసీఐ (ఎన్‌పీసీఐ) లింకు కానీ వాళ్ళు ఎన్‌పీసీఐ వెబ్‌సైట్‌లో లింక్ చేసుకోవచ్చని లేకపోతే, బ్యాంక్‌కి వెళ్లి ఎన్‌పీసీఐ లింక్ చేసుకోవాలని ఆయన ప్రజలను కోరారు.

# మర్రిపాడులో రెవెన్యూ సదస్సులు ప్రారంభం



**మర్రిపాడు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులు మర్రిపాడు మండలంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఈ తరుణంలో మండల పరిధిలోని డీసీపల్లి, నందవరం పంచాయితీల్లో తాసిల్దార్ అనిల్ కుమార్ రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సదస్సులో ఆయా గ్రామాల రైతులు సమస్యలను విన్నవించుకున్నారు. ఆ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులతోపాటు మాజీ మండల ఉపాధ్యక్షులు కోనంకి శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప గుడిలో మండల పూజలు



**నెల్లూరు కల్చరల్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు వేదయపాలెంలో వేంచేసియున్న వేద శాస్త్ర స్వామిఅయ్యప్ప స్వామి దేవస్థానంలో అయ్యప్పస్వామి వారికి కేరళ సాంప్రదాయ కార్తీకమాస మండల పూజలు శుక్రవారం ఘనంగా జరిగింది. ఉదయం పాలాభిషేకం, మహాగణపతి హెూమం, ఉష పూజ, నవకాభిషేకం, ఉచ్ఛపూజ, శ్రీ వేలి ఉత్సవం, సాయంత్రం మహాదీపారాధన, భగవతి సేవా, అత్తాళ్ళ పూజ, శ్రీ వేలీ ఉత్సవం, పడి కర్పూరం, హరివరాసనం, కార్యక్రమాలు కేరళ తంత్రులచే ఘనంగా జరిగాయి. మండల పూజలు మధ్యాహ్నం అన్నదానం ఉభయ కర్తలుగా గండవరపు వినోద్‌రెడ్డి దీప దంపతులు, గండవరపు వంశీకృష్ణారెడ్డి అర్చన దంపతులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు గూడల శేషగిరిరావు, కార్యదర్శి కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్ రావు, గడ్డం విజయకుమార్, పావలా ప్రసాదు పలువురు అయ్యప్ప స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** ఈనెల 15వ తేదీన పౌర్ణమి సందర్భంగా ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం అరుణాచలంకు ప్రత్యేక బస్సు సర్వీసు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బస్సు 14న ఉదయం 8 గంటలకు ఉదయగిరిలో బయలుదేరుతుం దన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కూడా కలదన్నారు. ఒక్కొక్కరికి రానుపోనూ రూ.1.650లు చార్జీ నిర్ణయించామన్నారు. ఈ అవకాశాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

# ఉపాధ్యాయుడు మృతిపట్ల ప్యాప్టో నిరసన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి ఉర్దుపాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్ అహ్మద్ మృతికి ఆత్మకూరులో గురువారం ప్యాప్టో ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. తొలుత వారంతా స్తానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడు ఇజాజ్‌అహ్మద్ మృతికి సంతాపంగా మౌనం పాటించారు. అనంతరం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ప్యాప్టో నెల్లూరు జిల్లా శాఖ అధ్యక్షుడు అల్లంపాటి సురేంద్రరెడ్డి మాట్లాడుతూ.. పాఠశాలల పరిసరాల్లో గుట్కా, గంజాయిలాంటి విషసంస్కృతిని ప్రభుత్వం అరికట్టాలన్నారు. ఉపాధ్యాయుడు మృతి అనుమానాస్పదంగా ఉన్నందున విచారణ జరపాలని, మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని సురేంద్రరెడ్డి డిమాండ్ చేశారు. ప్యాప్టో కార్యవర్గసభ్యులు బి.శివప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులకు పాఠశాలల్లో రక్షణ కల్పించాలన్నారు. మళ్ళీ ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ప్యాప్టో ప్రతినిధులు అంకయ్య, ఖాదర్‌బాషా, నరేంద్రరెడ్డి, హెచ్.హరికృష్ణ, బి.సుధాకర్, జె.కొండయ్య, సి.హెచ్.శివకుమార్‌రెడ్డి, రాఘవరెడ్డి, పి.పెంచలయ్య, సుధాకర్‌రెడ్డి, మాలకొండయ్య, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో మెగా పేరెంట్స్‌డే నేడే



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం మేరకు ఆత్మకూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈనెల 7వ తేదీ శనివారం ఉదయం మెగా పేరెంట్స్, టీచర్స్‌డే కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో అందరు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హాజరుకావాల్సి ఉండగా పాఠశాలల పరిధిలోని ప్రజాప్రతినిధులు, పూర్వ విద్యార్థులు, ఇతర ప్రముఖులను ఆహ్వానించాలని, అందరూ హాజరయ్యేలా చూడాలని, ప్రత్యేక కార్యక్రమాలు, ఆయా పాఠశాలల అవసరాలు, అభివృద్ధి గురించి చర్చించాల్సి ఉంది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ఒకే రోజు నిర్వహించే నిర్ణయించారు. ఆత్మకూరు మండలంలో అన్ని పాఠశాలల్లో ఈకార్యక్రమం నిర్వహించనుండగా స్థానిక ప్రభుత్వ ఉన్నతపాఠశాలల్లో జరుగనున్న కార్యక్రమంలో స్తానిక ఎమ్మెల్యే, రాష్ట్ర దేవాదాయశాఖా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి హాజరుకానున్నారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ముమ్మరంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఆప్రాంతంలోని ప్రముఖులు, పూర్వవిద్యార్థులను ఆహ్వానించే కార్యక్రమంలో ఉన్నారు. గురువారం స్తానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని అనంతలక్ష్మి, పిడి తిరుపతయ్య, ఉపాధ్యాయులు స్థానిక మండలాధ్యక్షుడు కేతా వేణుగోపాల్‌రెడ్డిని కలిసి ఆహ్వానపత్రిక అందజేశారు. ఈక్యాక్రమాన్ని విజయవంతంగా జరిగేలా, ప్రభుత్వ లక్ష్యం ప్రకారం జరిగేలా ఏర్పాట్లు చేయాలని, తమవంతుగా సంపూర్ణ సహకారమందిస్తామని వేణుగోపాల్‌రెడ్డి వారికి తెలిపారు. మంత్రి కార్యక్రమ ఏర్పాట్లు గురించి వేణుగోపాల్‌రెడ్డి ఉపాధ్యాయబృందంతో చర్చించారు. ఈకార్యక్రమంలో ఎంపిడివో పి.ఐజాక్‌ప్రవీణ్ పాల్గొన్నారు.

## హాజరుకానున్న మంత్రి ఆనం

## పుష్ప సినిమా టిక్కెట్ ధరలు తగ్గించాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని రామకృష్ణ థియేటర్‌లో ప్రదర్శిస్తున్న పుష్ప-2 పినిమా టిక్కెట్‌ధర తగ్గించాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాటసమితి ప్రతినిధులు శుక్రవారం స్థానిక ఆర్డీవో కార్యలయంలో వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా టిక్కెట్‌లను అధికధరకు విక్రయిస్తున్నారని వారు పేర్కొన్నారు. జిల్లా కుల వివక్ష వ్యరేక పోరాట సమితి నాయకుడు ఏ.నాగయ్య, పట్టణ సిపిఎం కార్యదర్శి కె.డేవిడ్‌రాజులు మాట్లాడుతూ.. ఆత్మకూరు థియేటర్‌లో సినిమా టిక్కెట్ ధరలు పెంచి విక్రయిస్తున్నారని. బయట వ్యక్తులచే బ్లాక్‌లో టిక్కెట్లు విక్రయిస్తున్నారని, వాహనాల పార్కింగ్‌కు కూడా అధికధర వసూలు చేస్తున్నారని, మల్టీప్లెక్స్ థియేటర్ కాకున్నా అన్ని క్లాసులకు ఒకే ధర నిర్ణయించి వసూలు చేస్తున్నారని, సామాన్యప్రజలపై భారంగా మారిందని వారు పేర్కొంటూ వెంటనే చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. ఈ సినిమా నేరప్రవృత్తిని ప్రోత్సహించేలా ఉందని, ఇలాంటి సినిమాలను బ్యాన్ చేయాల్సిన అవసరం ఉందని కూడా వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సిపిఎం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయసాధన అందరి లక్ష్యంకావాలి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆశయసాధన అందరి లక్ష్యం కావాలని రాష్ట్ర తెలుగుదేశం కార్యదర్శి దావా పెంచలరావు, కరటంపాడు సర్పంచ్ పూనుగుంట రేవతిలు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్మకూరు మండలం కరటంపాడులో డాక్టర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. దావా పెంచలరావు, రేవతిలు డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారతరాజ్యాంగాన్ని రచించిన డాక్టర్ అంబేద్కర్ అన్నివర్గాల అభ్యున్నతి, సంక్షేమం ఆశించారన్నారు. అన్నివర్గాలకు న్యాయం జరిగేలా, అందరి హక్కులు పరిరక్షించేలా రాజ్యాంగంలో పొందుపరిచారని వారు పేర్కొన్నారు. బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి కృషిచేసిన అంబేద్కర్ అందరికీ స్పూర్తి దాయకమన్నారు. అంబేద్కర్ ఆశయసాధనకు తమవంతుగా చిత్తశుద్ధిగా కృషిచేస్తామని, ఆయన ఆశయాలు తమకు శిరోధార్యమని దావా, రేవతిలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్రెడ్ స్వచ్ఛందసంస్థ డైరెక్టర్ వాగాల శ్రీహరి, సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి ఎల్.వి.ప్రసాద్, మాజీ సర్పంచ్ పూనుగుంట సరస్వతమ్మ, తదితరులు పాల్గొన్నారు. కరటంపాడులో క్రమం తప్పకుండా అంబేద్కర్ జయంతి, వర్ధంతిని తాము నిర్వహిస్తున్నామని, అందుకు ఇక్కడ డాక్టర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన దివంగత కరటంపాడు మాజీ సర్పంచ్ జ్యోతిగురవయ్యను వారు స్మరించుకున్నారు.

## గ్రామాల్లో రెవిన్యూసదస్సులు ప్రారంభం : తహశిల్దారు

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలో ఈనెల 6వ తేదీ శుక్రవారం నుండి రెవిన్యూసదస్సులు నిర్వహిస్తున్నామని స్తానిక తహశిల్దారు వి.సుధీర్ పేర్కొన్నారు. 6వ తేదీ ఉదయం 10గంటలకు పమిడిపాడులో, మధ్యాహ్నం 2గంటలకు నబ్బీనగరంలో రెవిన్యూసదస్సులు నిర్వహిస్తామన్నారు. 7వ తేదీ ఉదయం వాసిలి, మధ్యాహ్నం నెల్లూరుపాళెం, 10వతేదీ ఉదయం నాగులపాడు, మధ్యాహ్నం నారంపేట, 13వతేదీ ఉదయం బోయలచిరువెళ్ళ, మధ్యాహ్నం చిరువెళ్లకండ్రిక, 17వతేదీ ఉదయం కరటంపాడు, మధ్యాహ్నం ఆరవేడు, 19వ తేదీ ఉదయం అప్పారావుపాళెం, మధ్యాహ్నం బట్టేపాడు, 21వతేదీ ఉదయం మహిమలూరు, మధ్యాహ్నం రామస్వామిపల్లి, 26వ తేదీ ఉదయం గండ్లవేడు, మధ్యాహ్నం బొటికర్లపాడు, 28వ తేదీ ఉదయం నువ్వురుపాడు, మధ్యాహ్నం పి.జంగాలపల్లి, 31వ తేదీ ఉదయం పడకండ్ల, మధ్యాహ్నం కనుపూరుపల్లి, జనవరి 2వ తేదీ ఉదయం దేపూరు, మధ్యాహ్నం బండారుపల్లి, 4వ తేదీ ఉదయం ఆత్మకూరుల్లో రెవిన్యూ సదస్సులు నిర్వహిస్తామని తహశిల్దారు పేర్కొన్నారు. ఆయా తేదీల్లో ఆయా గ్రామాల వారు ఏదేని భూసమస్యలుంటే వినతిపత్రాలు ఆధార్‌కార్డు జతచేసి అందజేయాలని కోరారు.

## ఆత్మకూరులో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు పట్టణంలోని అరుందతీయవాడ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు భారతరాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ బస్టాండులోని అంబేద్కర్ విగ్రహానికి వారు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అంబేద్కర్ జీవిత విశేషాలను హజరత్తమ్మ, రవీంద్రలు గేయాలాపనగావించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగేంద్ర, ఉపాధ్యాయిని మాలకొండమ్మ, ఈ పాఠశాల పూర్వ ఉపాధ్యాయుడు, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘ మండల ప్రధాన కార్యదర్శి లక్కు కృష్ణప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా హాస్పిటల్‌లో అంబేద్కర్ వర్ధంతి



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరులోని ప్రభుత్వ వైద్యశాలలో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ చిత్రపటానికి ఆర్‌ఎంవో డాక్టర్ ఉషాసుందరి పూలమాల వేసి నివాళులర్పించారు. డాక్టర్ అంబేద్కర్ జీవిత విశేషాలను, రాజ్యాంగం రచించిన పరిస్థితిని గురించి డాక్టర్ ఉషాసుందరి వివరించారు. అంబేద్కర్ జీవితాన్ని అందరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆలయాల్లో చోరీ

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గుడినరవలో పలు ఆలయాల్లో చోరీ జరిగిన సంఘటన గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు బుధవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గ్రామ శివారులో ఉన్న అంకాళమ్మ, శివాలయాల్లో గల హుండీలను ధ్వంసం చేసి నగదు చోరీ చేసినట్లు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సైతం సమాచారం అందించామని వారు పేర్కొన్నారు.

## 18 అడుగులకు చేరిన నీటిమట్టం

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** మండలంలోని గండిపాళెం జలాశయం నీటిమట్టం 18 అడుగులకు చేరినట్లు జలవనరుల శాఖ డీఈ కె.చంద్రమౌళి శుక్రవారం తెలిపారు. ఇటీవల కురిసిన వర్షాలకు పైతట్టు ప్రాంతాల నుంచి 880 క్యూసెక్కుల వరద ప్రవాహం జలాశయానికి వస్తున్నట్లు ఆయన తెలిపారు.

# ఘనంగా అంబేద్కర్ వర్ధంతి వేడుకలు

**నెల్లూరు క్రైం, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు అర్పించారు. నెల్లూరు నగరంలోని ట్రంక్ రోడ్ నందు గల ఆల్ ఇండియా ఫార్వర్డ్బ్లాక్ జిల్లా కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రమాటానికి పూలమాలనేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కన్వీనర్ పాశం నరసింహారావు కో కన్వీనర్ పి.లీలా మోహన్ మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మరణించడం భారతదేశ ఎన్నిక కాకుండా ప్రపంచానికి తీరని లోటు అని ఆయన చూపిన మార్గంలో ఇవాళ కోట్లాదిమంది ప్రజలు బడుగు బలహీన వర్గాలు ఉన్నతంగా బతుకుతున్నారంటే ఆయన తెచ్చిన రాజ్యాంగంలో పొందుపరిచిన అనేక వాటి వలన మనం ఈరోజు ఉన్నతంగా బ్రతకగలుగుతున్నామని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఒక కులానికి ఒక మతం సంబంధించిన వాడు కాదని ఆయన అందరూ వాడిని ఆ మహనీయుడు మూలంగానే ఇవాళ బడుగు బలహీన వర్గాలతోపాటు అణగారిన వర్గాలు చదువుకొని మంచి ఉద్యోగాలు సాధించి ఇవాళ దర్జాగా బతకడం జరుగుతుందని ప్రధానంగా అంటరానితనాన్ని నిర్మూలించడం ప్రతి ఒక్కరికి ఓటు హక్కును ప్రసాదించడం మహిళలకు ఆస్తిలో సమాన హక్కును కల్పించడం తదితర కీలకమైన అంశాలను రాజ్యాంగంలో చేర్చడం ద్వారా ప్రజలకు మరింత మేలు జరిగిందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడానికి ప్రజలు ఎల్లవేళలా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు షేక్ కరీముల్లా భవాని స్వామి సాంబ హైకోర్టు న్యాయవాది చింతకుంట శ్రీనివాసులు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.




# అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించిన జనసేన



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కళ్యాణ్ సూచన మేరకు జనసేన పార్టీ ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ నలిశెట్టి శ్రీధర్ ఆదేశాల మేరకు జనసేన పార్టీ ఆత్మకూరు టౌన్ నాయకులు, ఆత్మకూరు టౌన్ చిరంజీవి యువత అధ్యక్షులు గడ్డం వంశీ కృష్ణ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. స్థానిక పాత బస్టాండ్ సెంటర్ వద్ద వున్న రాజ్యాంగ ప్రదాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అంబేద్కర్ విగ్రహానికి ఆత్మకూరు జనసేన పార్టీ నాయకులు పులమాల వేసి ఘననివాళులర్పించారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ.. ప్రపంచంలో కుల, మత జాతి అనే తేడా లేకుండా ప్రజలంతా ఒక్కటే అనే విధంగా రాజ్యాంగాన్ని రూపొందించి అందరికీ సమాన హక్కులు కల్పించిన ఏకైక వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని, ఆయన రచించిన రాజ్యాంగాన్ని అమలు పరిచి తమ ప్రజల హక్కులు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు రూరల్ జనసేన పార్టీ నాయకులు వెంకటేశ్వర్లు, చేజర్ల మండల చిరంజీవి యువత అధ్యక్షులు శ్రీను, ఆత్మకూర్ రూరల్ జనసేన పార్టీ నాయకులు రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక అవసరాల కోసం పొదుపు సూత్రం పాటించాలి

**ంపొదలకూరు, మేజర్‌న్యూస్ :** ఆర్థిక అత్యవసరాల కోసం ప్రతి ఒక్కరూ పొదుపు సూత్రాన్ని పాటించాలని 54వ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ తాతా వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం నెల్లూరులోని వెంకటేశ్వరపురంలో ఆర్బీఐ వారి సౌజన్యంతో పొదలకూరుకి చెందిన ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ బ్యాంకు ఖాతాదారులకు ఆర్థిక అక్షరాస్యత - సైబర్ మోసాలపై అప్రమత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. బ్యాంక్ సేవలు, ఆర్థిక మోసాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమలో భాగంగా పలు రకాల బ్యాంకు పథకాలు, సేవలపై సంపూర్ణ అవగాహన కల్పిస్తూ ప్రదర్శించిన గోడపత్రికలు చూపరులను ఆకొట్టుకున్నాయి. అనంతరం ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు షేక్.నౌరాజ్, కార్యదర్శి షేక్ అహ్మద్ సంస్థ రిసోర్స్ పర్సన్స్ కె.వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్ మాట్లాడుతూ పొదుపు అవసరం, సైబర్ నేరాలపై బ్యాంక్ ప్రతినిధులమంటూ అపరిచితుల నుంచి వచ్చే మేసేజ్‌లు, ఫోన్ కాల్స్‌కు స్పందించవద్దన్నారు. ఫోన్‌కు వచ్చే ఓటీపీ, డెబిట్ కార్డుల పిన్, సీవీవీ వంటి నంబర్లు ఇతరులకు చెప్పవద్దన్నారు. అలాంటి గోప్యతా వివరాలను బ్యాంకులు అడగవని గుర్తించాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖాతాదారులకు అందిస్తున్న ప్రత్యేక పథకాలు, సేవలను ఖాతాదారులకు వివరించారు. వ్యక్తిగత ఆర్థిక ప్రణాళికలను ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. నగదు రహిత లావాదేవీలు నిర్వహించడానికి ప్రాముఖ్యత ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదుల వ్యవస్థను ఉపయోగించుకొని సత్వర సక్రమ ఆర్థిక సేవలను పొందాలన్నారు. బ్యాంకింగ్ అంబుడ్స్ మెన్‌ను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు ఖాతాదారులు, స్థానికులు పాల్గొన్నారు.




## బిఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళులు



**అనుమసముద్రంపేట, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా ప్రభుత్వ కార్యాలయంలో ఘనంగా నివాళులు అర్పించారు. ఏఎస్ పేటలోని తహసిల్దార్ కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బడుగు బలహీన అన్న వర్గాల కోసం చేసిన పోరాటాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యాలయ సిబ్బంది వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

### భార్యపై వేధింపులు రుజువు కావడంతో

## భర్తకు ఏడు సంవత్సరాలు జైలు శిక్ష

**బోగోలు, మేజర్‌న్యూస్ :** 2013వ సంవత్సరం బోగోలు మండలం అల్లిమడుగు సంఘంకు చెందిన కొప్పోలు రుతు అను ఆమెను తన భర్త అయిన కొప్పోలు అశోక్ (జార్జ్) అదనపు కట్నం కోసం హింసించి చంపేసినట్లు, ఆమె అన్న జలచిత్ర దత్తాత్రేయ ఇచ్చిన పిర్యాదు మేరకు కొప్పోలు అశోక్, అతని తల్లి కుమారి అతని చెల్లెలు చిన్నారిపై 304-బి ఐపీసీ సెక్షన్ క్రింద కేసు నెం.57/2013 నమోదైనది. నాటి కావలి డీఎస్పీ ఇందిర కేసును విచారణ జరిపి ఆ ముగ్గురు ముద్దాయిల మీద ఛార్జ్ షీట్ దాఖలు చేసినారు. ఈ కేసు 8వ అడిషనల్ డిస్టిక్ట్ సెషన్ జడ్జి కోర్ట్ నందు వాదనలు జరిగి అందులో ఏ-1 ముద్దాయి అయిన కొప్పోలు అశోక్ (జార్జ్)పై నేరం ఋజువు కాగా మిగిలిన ఇద్దరు మీద కేసు ఋజువు కానందున. 6వ తేదీ శుక్రవారం అడిషనల్ డిస్టిక్ట్ సెషన్స్ జడ్జ కోర్ట్ వారు ఏ.1 ముద్దాయి కొప్పోలు అశోక్‌కు 7సంవత్సరాలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించి జైలుకు పంపినట్లు ఎస్ఐ కే.బోజ్య నాయక్ తెలిపారు.

## అన్నవరంలో రెవెన్యూ సదస్సు..



**జలదంకి, మేజర్‌న్యూస్ :** ప్రభుత్వ ఆదేశాలను అనుసరిస్తూ జలదంకి మండలం అన్నవరం గ్రామ సచివాలయంలో తహసిల్దార్ ప్రమీల రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలు రెవెన్యూ సమస్యలపై ఆమెకు అర్జీలు సమర్పించారు. అర్జీలు స్వీకరించిన ఆమె పరిశీలించి సమస్యలు లేకుండా పరిష్కరిస్తామని అర్జీదారులకు ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉదయగిరి నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు పూనూరు భాస్కర్‌రెడ్డి, టీడీపి నాయకులు పూనూరు రామకృష్ణారెడ్డి, ఆర్ఐ శ్రీజ, సర్వేర్ శోభన్‌బాబు, దేవాలయ శాఖ సత్తయ్య, వీఆర్వోలు గిరిధర్, ఫణి, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌కు ఘన నివాళి



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలం బ్రాహ్మణ కాక గ్రామం హరిజనవాడలో ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ కాక వీఆర్వో మణికంఠ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. దేశంలోనే అత్యున్నతమైన భారత రాజ్యాంగాన్ని రసించి ఈ దేశానికి దిశా దశ సమాజానికి ప్రతి పౌరుడికి హక్కులు కల్పించిన మహనీయుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన అన్నారు. భారతదేశంలోని తొలి న్యాయ శాఖ మంత్రిగా అత్యున్నతమైన సేవలు అందించారని గ్రామస్థాయి సర్పంచి నుండి దేశ ప్రధాని వరకు ఆయన రాసిన రాజ్యాంగమే ద్వారానే అమలు అవుతుందని ఆ మహనీయుడు బాటలో ప్రతి ఒక్కరు నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు గ్రామ ప్రజలు అంబేద్కర్ యూత్ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

**బోగోలు, మేజర్‌న్యూస్ :** బోగోలు మేజర్ పంచాయితీ పరిధిలోని కప్పరాల తిప్ప గ్రామంలోని డాక్టర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం మండల విద్యాశాఖ అధికారులు జయమ్మ, నరసింహారావు ఆకస్మిక తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను పరిశీలించి కళాశాల ప్రిన్సిపాల్ పద్మావతితో మాట్లాడారు. కళాశాలలో శనివారం జరిగే పేరెంట్స్ సమావేశంపై పలు సూచనలు సలహాలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఆధ్యాపకులు తదితరులు ఉన్నారు.

### 24 గంటల్లో అనుమతులు ఇచ్చేందుకు

# చర్యలు తీసుకుంటాం

**పురపాలక శాఖ మంత్రి నారాయణ**



**నెల్లూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్ :** బిల్డింగ్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో పర్మిషన్ ఇచ్చే నూతన విధానాన్ని తీసుకువస్తున్నామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. శుక్రవారం నెల్లూరు నగరపాలక సంస్థ కార్యకలాపాలపై కమాండ్ కంట్రోల్‌లో మంత్రి నారాయణ, కమిషనర్ సూర్యతేజతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో బిల్డింగ్ అనుమతులకు అవసరమైన అన్ని పత్రాలు సమర్పిస్తే కేవలం 24 గంటల్లో పర్మిషన్ ఇచ్చే నూతన విధానాన్ని త్వరలో తీసుకువస్తున్నామన్నారు. వివిధ లే అవుట్ లలో పార్కుల కోసం కేటాయించిన భూమిని ఖచ్చితంగా పార్కుల కోసమే వినియోగించాలన్నారు. నెల్లూరు నగరపాలక సంస్థను ప్రతివారం సమీక్షిస్తున్నామని, నగరాన్ని స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దేందుకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తామన్నారు. నగరంలోని పార్కులను సెంట్రల్ లైటింగ్ సిస్టంను అభివృద్ధి చేస్తామన్నారు. అయితే ప్రజలు కూడా వివిధ రకాల రెవిన్యూ బకాయిలను చెల్లించాలన్నారు. ఇప్పటికే నాలుగు నెలల కాలంలో ఆరున్నర కోట్ల రెవిన్యూ బకాయిలు ప్రజలు చెల్లించారని, వారిని ఆదర్శంగా తీసుకొని మిగతావారు కూడా పెండింగ్లో ఉన్న 120కోట్ల బకాయిలను చెల్లించాలన్నారు. ప్రజలు చెల్లించిన సొమ్మును తిరిగి ప్రజావసరాలకే వినియోగించాలన్నారు. అప్పుడే నగర అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. నెల్లూరు నగరంలో పుట్టి దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన నెల్లూరు వాసులు నగరంలోని అభివృద్ధి చేసిన పార్కులను దత్తత తీసుకుని నిర్వహణ చేపట్టాలని పిలుపునిచ్చారు. నగరంలోని పశువుల సమస్యను పరిష్కరించడానికి ప్రత్యేక వాహనం కేటాయిస్తున్నామన్నారు. అలాగే వీధి కుక్కల పునరుత్పత్తికి అవకాశం లేకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియను వేగవంతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడి నట్లు ఉంది..

# తపాతోపు అండర్ పాస్ బ్రిడ్జి పరిస్థితి




**కొడవలూరు, మేజర్‌న్యూస్ :** కొడవలూరు మండలం నార్త్ రాజుపాలెం గ్రామం మజార తపాతోపు గేటు ఎప్పుడు రద్దీగా ఉండి మూడు మండలాలకు వాహనాల రాకపోకల సాగిస్తుంటాయని ఇటీవల కాలంలో గేటు మరమ్మతులకు గురి అవుతున్న కారణంగా ఇచ్చట అండర్ పాస్ బ్రిడ్జిని నిర్మించడం జరిగిందని ఈ అండర్ పాస్ బ్రిడ్జి వర్షాలు పడినప్పుడు ఆరడుగులు నీరు నిండి దుర్గంధ భరితంగా మారుతుందని, రైతులు గేటు అవతలి వైపు ఉన్న పొలాలకు పోవుటకు నాలుగు ఐదు కిలోమీటర్లు ప్రయాణించి పొలం పనులు ముగించుకొని రావాల్సి వస్తుందని ఇటు గేటు లేక అటు అండర్ పాస్ లేక చాలా ఇబ్బందిగా ఉందని రైల్వే అధికారులు జిల్లా ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి అండర్ పాస్ బ్రిడ్జిలో ఉన్నటువంటి నీటిని తొలగించి రాకపోకలు సాగే విధంగా చూడాలని యధాతధంగా తపతోపు గేటును కూడా మరమ్మత్తులు నిర్వహించి రాకపోకలు సాగే విధంగా చూడాలని కోరుకుంటున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సురేందర్ రెడ్డి పొన్నూరు చంద్ర దయాకర్ కంభంపాటి ప్రకాశం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్ చేసిన పోరాటాల జ్యోతి

# నేటికీ అనేకమంది జీవితాలలో వెలుగులు నింపుతోంది

**- మేయర్ స్రవంతిజయవర్ధన్**



**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం వీఆర్‌సీ సెంటర్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి నగర మేయర్ స్రవంతి జయవర్ధన్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ.. డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ బడుగు, బలహీన అణగారిన వర్గాల కోసం చేసిన పోరాటాల జ్యోతి ఈ రోజుకి కూడా అనేకమంది జీవితాలలో వెలుగులు నింపుతూనే ఉంది అనే మాటలో ఎటువంటి అతిశయోక్తి లేదు అని మాత్రం చెప్తున్నారు. నా లాంటి ఎంతోమంది ఇలా మాట్లాడగలుగుతున్నాము. అంటే అది డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పోరాటాల ఫలితం, ఆనాడు వారు వేసిన పూల బాట అని అన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కేవలం అణగారిన వర్గాల కోసం మాత్రమే కాదు మహిళలకు సమాన ఆస్తిహక్కు, మహిళలకు మెటర్నిటీ లీవ్స్ ఉండాలని ఒక దూర దృష్టి కలిగిన దార్శనికులు డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ వారి ఆశయ సాధనకోసం శక్తి వంచన లేకుండా పోరాటం చేస్తామని తెలియజేశారు. వారి అడుగుజాడలని ఆదర్శంగా తీసుకోని వారి ఆశయ సాధన కోసం కృషి చేయాల్సిన అవసరం నేటి యువత పై ఉంది అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు షఫీ, సిరాజ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా వీఎస్ కిచెన్ రెస్టారెంట్ ప్రారంభం




**నెల్లూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్ :** నెల్లూరు నగరంలోని స్థానిక కొండయ్య పాలెం గేటు సెంటర్ ఐటిడిపి కార్యాలయం ఎదురుగా వీఎస్ కిచెన్ రెస్టారెంట్‌ను నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. నెల్లూరు నగరం ఆహారానికి ప్రసిద్ధి చెందిందని, ప్రతి ఒక్కరు ఈ రెస్టారెంట్ ను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెస్టారెంట్ నిర్వాహకులు దాసరి విజయ్ కుమార్, శ్రీధర్ రెడ్డి, టిడిపి నేత దాట్ల చక్రవర్తన్‌రెడ్డి, మదన్ కుమార్‌రెడ్డి, కార్పొరేటర్ చేజర్ల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేద్కర్‌కి ఘన నివాళి : మాజీ ఎమ్మెల్యే



**జలదంకి, మేజర్‌న్యూస్ :** జలదంకి మండలంలోని శుక్రవారం బ్రాహ్మణ క్రాక లోని సచివాలయంలో భారత రాజ్యాంగ రూపశిల్పి భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 68వ వర్ధంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటంకు పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ రూపకర్త బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అలుపెరగని కృషి చేసిన మహానుభావుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఇండ్ల సుధాకర్, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు నందు, మేకల శ్రీనాథ్‌రెడ్డి, పాండురంగారెడ్డి, శేషారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## ఈతకు వెళ్లి బాలుడు మృతి



**విడవలూరు, మేజర్‌న్యూస్ :** పెన్నానదిలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన దక్కా నోయల్ (15) అనే బాలుడు మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికులు కథనం మేరకు ముదివర్తి గ్రామం దళితవాడకు చెందిన నోయల్ పెన్నానదిలో నీటి ప్రవాహం చూసి సరదాగా ఈత కొట్టాలని వెళ్ళాడు. అయితే నీటిలో లోతు గ్రహించని నోయల్ నీటిలోనే మృతి చెందాడు. దీంతో తమ కుమారుడు ఇంటికి రాలేదని తల్లిదండ్రులు గాలింపు చేపట్టగా పెన్నా నది వైపు వెళుతున్నాడని గ్రామస్తులు నోయల్ తల్లిదండ్రులకు తెలపడంతో వారు పెన్నా నది పరివాహక ప్రాంతమంతా గాలింపు చేపట్టారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో దిగాలు చెందారు. ఎట్టకేలకు అర్ధరాత్రి సమయంలో నోయల్ మృతదేహం పెన్నానది ఒడ్డు కొట్టుకు వచ్చింది. స్నేహితులతో స్థానికులతో సరదాగా ఉండే నోయల్ క్షణాల్లోనే విగతా జీవుడుగా మారిపోవటంతో తల్లిదండ్రులు, స్నేహితులు, స్థానికులు, జీర్ణించుకోలేకపోయారు. అనంతరం శుక్రవారం మృతదేహానికి పోస్టుమార్టం చేసి కేసు నమోదు చేశారు.

# మెగాపేరెంట్స్, టీచర్స్‌డే విజయవంతం చేయాలి : ఎండీఓ

**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** ఆత్మకూరు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం మెగా తల్లిదండ్రుల, ఉపాధ్యాయుల దినోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించాలని స్థానిక ఎంపీడీఓ పి.ఐజాక్‌ప్రవీణ్ కోరారు. ఈ కార్యక్రమ విజయవంతానికి నియమించిన నోడల్ అధికారులు, మండల అధికారులు, సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లుతో గురువారం ఎండీఓ ఐజాక్‌ప్రవీణ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగిస్తూ ఈ కార్యక్రమానికి మండల, గ్రామస్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు తప్పకుండా హాజరుకావాలని ఆయన సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పనితీరును మరింతగా మెరుగుపరచడానికి, ప్రజల భాగస్వామ్యం కల్పించడానికి పేరెంట్స్, టీచర్స్ మెగా మీటింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సంయుక్తంగా విద్యార్థుల భవిష్యత్తు తీర్చిదిద్దడానికి తగు ప్రణాళికలు గురించి ఈ సమావేశంలో చర్చిస్తారని ఐజాక్‌ప్రవీణ పేర్కొన్నారు. నోడల్ అధికారులుగా నియమితులైనవారు, పంచాయతీ కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు, సచివాలయాల సిబ్బంది ఈ కార్యక్రమం నిర్వహణకు సహకరించాలన్నారు. ఆయా పాఠశాలల



పరిధిలోని ప్రజాప్రతినిధులు, పూర్వవిద్యార్థులు తదితరులను ఆహ్వానించాలని ఆయన సూచించారు. పాఠశాలల ఆవరణలో పారిశుధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని ఆయన కార్యదర్శులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో మండలపరిషత్ కార్యాలయ పాలనాధికారి కె.శ్రీనివాసరావు, మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# ఫౌండేషన్ సహకారంతో పేదలకు దుప్పట్లు పంపిణీ



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో కోపరేటివ్ కాలనీలో ఉన్న కృపాకర్ పురపాలక శుక్రవారం సహృదయ ఫౌండేషన్ వారి సౌజన్యంతో శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ వారు చలికాలం విద్యార్థులకు దుప్పట్లను పంపిణీ చేశారు అనంతరం శ్రీ సాయి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు పొన్నగంటి మాధవి మాట్లాడుతూ.. మా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో చలికాలం సందర్భంగా పురపాలక పాఠశాలలో పేద విద్యార్థులు ఉంటున్నారు గ్రహించి వారి కుటుంబ సభ్యులు శీతాకాలంలో చలి ఎక్కువగా ఉన్నందున వారి కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నారనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేసినట్లు సహృదయ చైర్మన్ బిందు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు సునీత రమ రావూరి వెంకట్రావు, బిసి ఐక్యత భవన్ కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, చిన్ని వరప్రసాద్, యానాది అంగన్వాడి టీచర్ సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

## కంపచెట్లు తొలగించిన తెలుగుయువత



**ఆత్మకూరు, మేజర్‌న్యూస్ :** పట్టణంలోని 18వ వార్డులో రోడ్లకు అడ్డంగా కంపచెట్లు పెరిగి ఇబ్బందికరంగా ఉండడంతో ఆప్రాంత తెలుగుయువత సభ్యులు స్వచ్ఛదంగా శ్రమదానం చేసి చెట్లను తొలగించారు. రోడ్లకిరు వైపులా చెట్లు పెరిగి జనాలకు అత్యంత అసౌకర్యంగా, ఇబ్బందికరంగా ఉండడాన్ని వారు గమనించారు. దాంతో గురువారం వారంతా స్వయంగా ఆ కంపచెట్లను తొలగించారు. దాంతో ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉండగా వారంతా తెలుగుయువత ప్రతినిధులను అభినందించి ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో తెలుగుయువత సభ్యులు షేక్ షరీఫ్, ఎన్.మహేంద్ర, వి.అశ్వంత్, పి.లక్ష్మయ్య, నాగరాజు, షేక్ హుస్సేన్‌సాహెబ్, సీహెచ్ చందు, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్‌కు ఘన నివాళులు

**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ భవన్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మార్పీఎస్ నాయకులు జాషువా, బాలగురవయ్య, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మేకపాటి గౌతంరెడ్డి ప్రభుత్వ వ్యవసాయ కళాశాలలో అసోసియేట్ డీన్ డాక్టర్ జీ.కృష్ణారెడ్డి, ఆల్తూరి రామిరెడ్డి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఆంధ్ర విద్యార్థి సంఘం నాయకులు శంకర్లు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



## రెవెన్యూ గ్రామసభలను సద్వినియోగం చేసుకోండి



**ఉదయగిరి, మేజర్‌న్యూస్ :** రెవెన్యూ గ్రామ సభలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసిల్దార్ ఎం.సుభద్ర పేర్కొన్నారు. శుక్రవారం గన్నేపల్లి పంచాయతీలో మిట్టపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. సందర్భంగా పలువు రైతులు అధికారులు మారినప్పుడల్లా భూ సమస్యల పరిష్కారానికి అర్జీలు ఇవ్వమంటే ఏలా, తమది వలస ప్రాంతం, అందరూ అందుబాటులో ఉండరంటూ పలువురు రైతులు అధికారుల ఎదుట వాపోయారు. ఈ సందర్భంగా పలువురు రైతులు తమ భూ సమస్యల పరిష్కారానికి తహసీల్దారు సుభద్రకు అర్జీలు అందజేశారు. సమస్యల పరిష్కారానికి గతంలో ఉన్న అధికారులకు అర్జీలు ఇవ్వగా వారు పట్టించుకోలేదని, మరలా అర్జీలు ఇవ్వాలంటే వ్యయప్రయాసాలు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దారు మాట్లాడుతూ.. రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకొని, భూ సమస్యలను పరిష్కరించ కోవాలని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నెల్లూరు వెంకటస్వామి, మాజీ సొసైటీ అధ్యక్షులు గడ్డం వెంకటేశ్వర్లు, డీటీ హసీనా, వీఆర్వో అంజాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భారీగా రేషన్ బియ్యం పట్టివేత



**కావలి, మేజర్‌న్యూస్ :** కావలి పట్టణంలో రోజురోజుకీ రేషన్ మాఫియా ఆగడాలు పెరిగిపోతున్నాయి.

కావలి పట్టణం కావలి తహసిల్దార్ జి.శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో 136 బస్తాలు రేషన్ బియ్యం కలిగిన లారీని కనుక్కొని స్వాధీనం చేసుకోవడం జరిగింది. అదేవిధంగా కావలి పట్టణంలో శుక్రవారం ఒకటో పట్టణ సీఐ ఫిరోజ్‌కు అందిన సమాచారం మేరకు తన సిబ్బందితో కలిసి రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న రెండు లారీలను గుర్తించి వాటిని పట్టుకొని స్వాధీనం చేసుకున్నారు. భారీగానే బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఇంకా వివరాలు తెలియాల్సి ఉంది.

## అంబేద్కర్‌కు ఘన నివాళి : ఎమ్మెల్యే కావ్య



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో స్థానిక ముసునూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ట్రంకు రోడ్‌లోని స్థానిక ఉదయగిరి బ్రిడ్జి కూడలిలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 68వ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. పూలమాలలు వేసి అనంతరం కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు గుత్తికొండ కిషోర్‌బాబు, ప్రధాన కార్యదర్శి జ్యోతి బాబురావు, అంబేద్కర్ అభిమానులు టిడిపి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదానం




**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణంలో శుక్రవారం భారతదేశంలో విద్యార్థులను మినహాయిస్తే రక్తదానం చేయడంలో బ్యాంకు, ఎల్ఐసీ ఉద్యోగులు అగ్రస్థానంలో ఉన్నారని రెడ్‌క్రాస్ రక్తకేంద్రం కన్వీనర్ డాక్టర్ బెజవాడ రవికుమార్ తెలిపారు. శుక్రవారం ఆయన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి, రక్తదాతలను అభినందించారు. ఈ శిబిరాన్ని బ్యాంకు మేనేజర్ ఏ.లక్ష్మీనారాయణ, పి.ప్రసన్న కుమార్ నిర్వహించారు. యస్కె అమజ్జీ, యం దిలీప్, జె.మనోహర్, సిహెచ్ పణికుమార్, కె.సాయికుమార్, రక్తకేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

## మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్..



**వెంకటాచలం, మేజర్‌న్యూస్ :** నేడు జరగబోయే మెగా పేరెంట్స్ మీటింగ్ సమావేశానికి సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, సర్వేపల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల నందు పాల్గొనడం జరుగుతుంది. కార్యక్రమం ఏర్పాటును మండల అభివృద్ధి అధికారి వెంకటాచలం వారు జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ సమగ్ర శిక్ష ఉషారాణి పరిశీలించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో కార్యక్రమ ఏర్పాట్లు గురించి చర్చించారు. తరువాత పాఠశాలలోని అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాసుల రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు యు.శ్రీనివాసులు పాఠశాలలోని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, సిఆర్ఎంటి డి.మస్తానయ్య పాల్గొన్నారు.

## వైసీపీ ఆధ్వర్యంలో అంబేద్కర్ వర్ధంతి



**కావలి, మేజర్‌న్యూస్ :** పట్టణం మాజీ ఎమ్మెల్యే వైఎస్ఆర్సిపి పట్టణ ఇన్‌చార్జ్ ప్రతాప్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 68వ వర్ధంతి వేడుకలను వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మొదటిగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించుకొని ఆయన మార్గంలో స్ఫూర్తిగా నడవాలని ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.